భూతం

"వన్ డౌన్"

"వన్ డౌన్ యాజ్ నో డౌన్"

"అసలు త్రీనోస్‌కు ఎందుకు వెళ్ళేరు. మీ దగ్గర ట్రిక్ వేల్యూస్ లేందే— ఇప్పుడు గేం ఛాన్స్ వృథాగా పోయింది. ఫోర్ కలర్స్‌లో చెక్ వుండద్దుటండీ."

"ఒక కలర్ మీరు ఇండికేట్ చేశారుగా ఓపెనింగ్‌లో...మీ బిడ్డింగ్ వల్ల మిస్‌లీడ్ అయాను"

"అయితే నా బిడ్డింగ్ తప్పంటారా"

"అనను కాని-"

"కానీ ఏవిటి గీని...మీది రాంగ్ ప్లే."

శివరామయ్యగారు కొంచెం గట్టిగానే అన్నారు.

మా వాగ్వివాదం చిన్న యుద్ధరంగంగా మారేట్లుందని తగ్గేను. శివరామయ్యగారి మీద ఉన్న గౌరవంకొద్దీ. అదీగాక కొద్దికాలం క్రితం ఆయనతో పరిచయం. ఆ పరిచయం స్నేహంగా మారుతున్న రోజులు, నేను తగ్గటానికి మరో కారణం గూడా ఉంది. అది ఆయన మొదటి ప్రపంచ యుద్ధానికి పది సంవత్సరాల ముందు పుట్టటం. మా ప్రత్యర్థులు ఇంచుమించు ఆ వయసులో వాళ్ళే. కాని ఆయనకన్నా చిన్నవాళ్ళే. ఒకాయన రఘుపతి. మరో ఆయన పరంధా

మయ్యా నేను తప్పుగా ఆడేనని వాళ్ళా నన్ను మంద లించారు.

వాళ్ళు ముగ్గురు.

నేను ఒకణ్ని.

నేను తగ్గటంలో ఆశ్చర్యంలేదు. నా వయస్సు అటూ ఇటూ కాని వయస్సు. జుట్టు మూడువంతులే ముగ్గు బుట్టగా మారింది. చిన్నవాళ్ళ గ్రూపులో చేరడానికి మనస్కరించదు. మరీ పెద్దవాళ్ళలో చేరితే ఇదీ వరస.

నేను ఆటలో చేతకాని వాణ్ణేమీ కాదు. పది సంవత్స రాలకుపైగా అనుభవం ఉంది. ఆంధ్రదేశంలో తెనాలి "బ్రిడ్జి" ఆటకు చాలా ప్రసిద్ధి, అక్కడ హేమా హేమీ లుండేవారు. నా ఆటకు పునాది అక్కడే. అలాంటి వాణ్ని చూస్తూ చూస్తూ ఆటలో అంత బ్లండర్ చేస్తానా! సమ గ్రంగా పరిశీలిస్తే శివరామయ్యగారిదే తప్పు. బ్రిడ్జి ఆటలో ఫండమెంటల్స్ తెలిసినట్టు కనబడదు. వాళ్ళ ముగ్గురూ తామేదో గొప్ప ఆటగాళ్ళమని అనుకుంటూ ఉంటారు.

నాకు రైలు ప్రయాణాలన్నా, ఊళ్ళు తిరగడం అన్నా సరదా. ఏ ఊరు ట్రాన్స్‌ఫర్ చేస్తే ఆ ఊరు సంతోషంగా వెళ్ళడం అలవాటయిపోయింది. ఇన్ని ఊళ్ళు తిరగడంవల్ల ఎన్ని రకాల వ్యక్తులతోటో పరిచయం. ఒక్కొక్కప్పుడు స్నేహం కలగడం సంభవిస్తుంది. కొందరు తమాషా వ్యక్తు లుంటారు. కొందరు గమ్మత్తు మనుషులు, నేను మితభాషి నవడంవల్ల స్నేహితులు, ఆప్తులు మాత్రం చాలా కొద్ది

మ ది ఉంటారు. ఏ ఊరు వెళ్ళినా చిన్నదో పెద్దదో "క్లబ్" అంటూ ఒకటి ఉంటుంది. సాయంత్రంపూట కాలక్షేపానికి కొంచెం సేపు టెన్నిస్, కొంచెం సేపు "బ్రిడ్జి" ఆడడం పరిపాటి. ఇక్కడే పరిచయాలూ స్నేహాలూ లభిస్తాయి...కొంత మంది దగ్గరకు వస్తారు. కొంతమంది మరీ దూరంగా ఉంటారు ఎవరో వాళ్ళను వెలివేసినట్టుగా...

ఈ ఊరు వచ్చిన కొత్తలో "క్లబ్"లో చేరినప్పుడు అలా వెలివేసినట్టుగా ఉన్న వాళ్ళను చూశాను. వాళ్ళ టేబిల్ జన సమూహానికి చాలా దూరంగా ఉంటుంది. నలుగురుండవలసిన టేబిల్‌ను ముగ్గురే ఆక్రమించుకున్నారు. ఎప్పుడు చూసినా ఆ ముగ్గురే ఒక డమ్మీ సహాయంతో వాళ్ళు బ్రిడ్జి ఆడుతుండేవాళ్ళు. కొంచెంసేపు టెన్నిస్ కూడా ఆడేవాళ్ళు. వాళ్ళ టెన్నిస్ చూస్తే నాకు నవ్వువచ్చేది. వధూవరులు పూలచెండు విసురుకున్నట్టుగా ఉండేది. వాళ్ళ ఆటలో మరొకరు చేరినట్టు కన్పించదు. శివరామయ్యగారూ రఘుపతి ఒకసారి ఆడేవారు. రఘుపతీ పరంధామయ్య ఒకసారి ఆడేవారు. టెన్నిస్ ఆట ఏ మాత్రం తెలిసిన వాళ్లు కూడా, వాళ్ళు ఆడే ఆటని చూసి చూస్తూ చూస్తూ టెన్నిస్ అని అనలేరు.

ఒకరోజున మరో కోర్టులో నేను టెన్నిస్ ఆడి, బాగా అలసిపోయి లానులో కుర్చీలో కూర్చుని సిగరెట్టు తాగుతూ వాళ్ళను గమనిస్తున్నాను. వాళ్ళు ఆట అయింతరువాత బ్రిడ్జికి ఉపక్రమించారు. వాళ్ళు ముగ్గురే... ఆట ప్రారంభం

అయింది. నా కెందుకో అక్కడకు వెళ్లాలనిపించింది. అటే చూస్తూ లేచివెళ్ళే ప్రయత్నంలో ఉన్నాను. ఇంతలో నా పక్కన ఉన్న డాక్టర్ శర్మ, "అక్కడికెందుకెళ్తారు స్వామీ. అది భూతాల టేబిల్...వాళ్ళవి కభంధహస్తాలు-ఆ వలలో చిక్కుకున్నారంటే మళ్లీ బయటకురాలేరు - వాళ్ళో పెద్ద బోర్-" అన్నాడు.

"ఫరవాలేదులెండి - సరదాగా ఉంటుంది - వెళ్ళి చూస్తాను-" అని బయలుదేరాను-

అలా బయలుదేరి వాళ్ళ వలలో చిక్కుకున్నాను. క్లబ్‌లో అనేక గ్రూపులు, గ్రూపుల్లో గ్రూపులు. ఎక్కడ చూసినా సందడిగా ఉంది! లాన్‌లో ఓ అరడజను మంది కూచుని సిగరెట్లు కాలుస్తూ గాసిప్ కొడ్తున్నారు. నవ్వులు కేకలు- రాజకీయాల్లాంటి వేవో వినిపిస్తున్నాయి. మరో మూలరమ్మీ టేబిల్స్ - అందరూ చాలా సీరియస్‌గా ఉన్నారు. సిగరెట్టు పొగ మాత్రం దట్టంగా కప్పేసింది జీవితంలో ఏదో అమూల్యమైనవి పోగొట్టుకున్న వాళ్ళ మాదిరి కొందరి బిక్క మొహాలు తొంగిచూస్తున్నాయి.

బిలియర్డ్స్ రూమ్ సందడిగా ఉంది. అక్కడ మరీ పెద్దగా నవ్వులూ కేకలూ- అక్కడా గదంతా సిగరెట్టుపొగ ఆవరించింది. ఏ క్షణానన్నా వర్షించే కారు మేఘంలా. అక్కడి వాళ్ళంతా చాలామంది కుర్రకారే ... అపుడప్పుడు పెద్దగా మాటలు వినపడుతున్నై. టేబిల్ టెన్నిస్ రూమ్‌లో బంతి బల్లమీద భరతనాట్యం చేస్తున్నది. మృదంగం వాయిస్తు

న్నట్టుగా ఉంది. "గుడ్ షాట్" అని మధ్యమధ్య నవ్వులు. అదే వాళ్ళ శరీరాలు మెలికలు తిరుగుతున్నై.

వరండాలో ఓ మూల ఇద్దరు వ్యక్తులు ప్రపంచంతో ఏమాత్రమూ సంబంధం లేనట్టుగా చదరంగంలో మునిగి ఉన్నారు. మేం ధన్యులం అనుకుంటున్నట్టుగా ఉన్నాయి వాళ్ళ ముఖకవళికలు.

మరి కొంచెం దూరంలో శివరామయ్యగారి టేబిల్. మాటలు వినిపిస్తున్నాయి.

"ఆ రోజులే వేరు. అయిదు రూపాయలు పారేస్తే బంగారు తీగలు- బియ్యం బస్తా ఇంటికొచ్చిపడేది. అది స్వర్ణయుగం అంటున్నారు శివరామయ్యగారు.

"బియ్యం అంటారేవిటి - గజం మూడణాలకు ఒకటో రకం మల్లు-తాన్లకు తాన్లు- కోటేశం కొట్టుకు కబురు చేస్తే మూటకట్టి ఇంటికి పంపించేవాడు."- రఘుపతి.

"అప్పటి నిజాయితీ ఏదండీ ఇప్పుడు" అంటున్నాడు పరంధామయ్య-

"అందుకేగా ఎవ్వరికీ ఓటు చెయ్యకుండా- నా వోటు నా దగ్గరే ఉంచుకుని వీళ్ళ రోగం కుదిరించాను-" శివరామయ్య.

"అంత విలువైన ఓటు వీళ్ళకు వేసి వృధా చెయ్యడమా- వీళ్ళకు అర్హత ఉండద్దూ-" రఘుపతి-

సంభాషణ మంచి పట్టులోవుంది నే వెళ్ళేటప్పటికి- ఎవరికో తిట్లూ, శాపనార్థాలు తగుల్తున్నయి.

"మీ రివ్వాళ టెన్నిస్ బ్రహ్మాండంగా ఆడేరు" అంటు న్నాను పరంధామయ్య శివరామయ్యగారి నుద్దేశించి.

టెన్నిస్‌లో యోధాను యోధులైన టెల్డన్ గురించి, ఫ్రెడ్ పెర్రీని గురించి సంభాషణ మొదలయింది.

శివరామయ్య గారంటున్నారు. "ఈ కృష్ణన్, ముఖర్జీ, ప్రేమ్‌జిత్. వీళ్ళుకూడా ఒక ఆటగాళ్ళేనా." అని.

"నా మొహం...చెప్పక చెప్పక వీళ్ళను గురించే చెప్పారూ...అయ్యో రామ...వాళ్ళ ఆట చూస్తుంటే నాకే సిగ్గుగా ఉంది." అంటున్నాడు పరంధామయ్య.

"ఆ రోజుల్లో నేను సింగిల్స్ ఆడుతుంటే అసలు బంతి కన్పించేదిటండీ. యుద్ధరంగంలో అభిమన్యుడికిమల్లే చెండుకు తినేవాణ్ణి" శివరామయ్యగారి కామెంట్.

"బాగా చెప్పారు. ఇప్పటికి మాత్రం మీరేమైన తక్కువా. అని వంతు పలికాడు పరంధామయ్య.

డాక్టర్ శర్మ చెప్పిన మాటలు నెమరు వేసుకుంటూ నెమ్మదిగా కాళీగా ఉన్న కుర్చీలో ఏదో తప్పుచేసినవాడిలా వాళ్ళ ముఖాలవంక చూస్తూ...కూర్చున్నాను. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. నేను కాలుస్తున్న సిగరెట్ వైపు చూస్తున్నారు శివరామయ్యగారు. ఆ చూపులో కొంచెం కోపం కన్పిస్తున్నట్టుగా ఉంది.

"మా శివరామయ్యగారికి సిగరెట్టు పొగపడదు లెండి. ఎలర్జీ." అన్నాడు రఘుపతి. చూస్తూ చూస్తూ కాలుస్తున్న

సిగిరెట్టును పారేయలేక. మూడుపంతులు అయిన తరువాత పారేశాను.

"తమకు బ్రిడ్జిలో ఏమన్నా ప్రవేశముందా—!" అన్నారు శివరామయ్యగారు.

"అంత ఎక్స్‌పర్టును కాననుకోండి. నాలుగో చేతికి పనికొస్తాను." అని వినయంగా చెప్పుకున్నాను.

"భేష్...చేయికలపండి" అన్నారు శివరామయ్యగారు ...అలా పరిచయమైంది వాళ్ళతో ... నిజంగానే వలలో చిక్కుకున్నాను. నన్ను వాళ్ళు వదలరు. నేను వాళ్ళను వదలను...శివరామయ్యగారంటే ఎందుకో ఆకర్షణ...పాత కాలం మనిషైనా అయిడలిస్ట్‌గా కన్పిస్తారు. జీవితంలో ఆయన అనుభవాలు కోకొల్లలు...ఒక్కొక్కప్పుడు ఆయన మాటలకు నవ్వు వస్తుంది. తను పెద్ద విట్టువేశానని ఆయన అనుకుంటారు. ఇది కూడా ఓ విట్టేనా అని నాకు నవ్వు వస్తుంది. ఆ నవ్వుకు ఆయన మురిసిపోతారు.

"ఈ ఆల్కహాలికులను చూస్తే నాకు వళ్ళుమంట" అన్నారు. శివరామయ్యగారు. ఓసారి...విరగబడి నవ్వేను, అందరూ నవ్వేరు.

*   *   *

రెవిన్యూ ఇలాకాలో ఇక్ష్వాకుల కాలంలో చేరి కలెక్టరుగా, రిటైరయినారు శివరామయ్యగారు స్వరాజ్యం వచ్చిన కొంతకాలానికి - రిటైరయే ముందు ఐ. ఎ. ఎస్. ఇచ్చారు. ఆయన ఇంటిముందు శివరామయ్య ఐ. ఎ. ఎస్.

అనే బోర్డు ఉంటుంది. మనకెందుకండీ స్వరాజ్యం. చాలా అనవసరం...డిసిప్లిన్ ఏదీ...?" అనే అర్థం స్ఫురించేట్టుగా మాట్లాడతారు. "మనుషులంటే వాళ్ళే మనుషులు." అని దొరల సంగతి చెప్తూ వుంటారు. రాబ్, మేగ్డనాల్డ్, డఫ్, బీస్, కాటన్... ఇలాంటి కలెక్టర్ల పేర్లు ఎప్పుడూ చెప్తూనే వుంటారు. "ఏ నాడో పుణ్యం చేసుకోబట్టి వాళ్ళ దగ్గర పనిచేసే అదృష్టం కలిగింది. అన్నారొకసారి- అబ్బ! ఎంత అదృష్టం" అనుకున్నాను.

"వానపాము గూడా పామేటండీ—" అన్నారు. "ఇప్పటి కలెక్టర్లు బొడ్డూడని అర్భకులు, అయ్యోరాత.

ఇప్పటి ప్రభుత్వోద్యోగులు, మంత్రులు ప్రభుత్వం, ఇంకా ఇలాంటివన్నీ ఆయన దృష్టిలో దిగదుడుపే.

"ఈ ప్రాజెక్టులేవిటి? ఈ పరిశ్రమలేవిటి. నా బొంద" అంటారు.

ఇతర దేశాల వస్తువులంటే మహా మోజు. వాటి నాణ్యం వీటికెక్కడ ఉందండి? అంటారు.

ఉద్యోగులను గురించి విసుర్లు ఇంక చెప్పక్కర్లేదు. "లంచగొండితనం ప్రబలి పోయింది. అంతాలఫంగ్‌లు, మన దేశం బాగుపడదు. మనఖర్మ, అంటారు.

"ఆ రోజుల్లో లంచగొండితనం లేదా." అని అడుగు దామనుకున్నాను. ఆయన్ను ఎదిరిద్దామంటే చచ్చేభయం.

ఎప్పుడు చెప్పినా మేడిన్ ఇంగ్లండ్ వస్తువులను గురించే చెప్తారు. "వాటికి చలనం ఎక్కడిదండీ" అంటారు. శివ

రామయ్యగారు బ్లేడ్ వాడరు. ఎప్పుడో నలభై ఏళ్ళనాడు నాన్న మేడిన్ జర్మనీ మంగలి కత్తి ఉంది ఆయన దగ్గర. మంగలంటు పడకుండా స్వయంగా దాన్ని ఉపయోగిస్తారు. ఇంకా ఇలాంటి వస్తువులు బోలెడున్నాయి. అందులో కొన్ని బ్లాక్ బర్డ్ కలం, తళతళా మెరుస్తున్న క్రిమెంట్జ్ గుండీలు మొదలైనవి.

"ఇంగ్లీషు పాప్లయిన్ ఎంత బాగుండేదనుకున్నారు. మనం చింపితే చినగాల్సిందేగాని, ఒకపట్టాన చినిగేదా. చాకలికి వేసినొద్దీ మెరుగు ఎక్కువయేది." అంటారు.

శివరామయ్యగారు ఓల్డ్ మెట్రిక్.

"అబ్బో! ఆస్టాండర్డ్సు వేరు. ఆ ఇంగ్లీషు వేరు. నేను డ్రాఫ్ట్ నపుటప్ చేస్తే దొరలు గుమ్మయిపోయి. అమాంతం కావలించుకుండేంత పని చేసేవారు. శివ్ రామయ్యా యు ఆర్ ఎస్మార్ట్ ఫెలో. అంటే ఎంత ఎంకరేజింగ్‌గా ఉండేది. ఒక రూపాయి స్పెషల్ ఇంక్రిమెంటు ఇస్తూ, నా బుజంతట్టే కాటన్ దొర - నా వళ్ళు పులకరించింది కాదుటండీ, ఆ రోజుల్లో రూపాయి ఇప్పటి వంద రూపాయలకు సమానం" అన్నారు.

నేను కళ్ళు పెద్దవి చేశాను.

శివరామయ్యగారు ఇంట రెస్టింగ్ మనిషే అనుకున్నాను.

ఆయనకు వర్తమానంతో పనిలేదు. భవిష్యత్తపలే

లేదు. వర్తమానం ఆయన దృష్టిలో వల్లకాదు. "మనకు భవిష్యత్తేమిటి నా బొంద" అంటారు.

శివరామయ్యగారిలో కొంత రసికత్వం కూడా లేక పోలేదు. తన పెళ్ళినాటి సంగతులు చెప్తుంటాడు. ఆయన పెళ్ళానికి అప్పుడు తొమ్మిదేళ్ళట.

"ఆ రోజుల్లో భోగం మేళాలు మహా ఎంజాయబుల్‌గా ఉండేవి లెండి" అని పెద్దగా నవ్వేరు ఒకసారి.

ఆయన నవ్వితే మేమంతా తప్పక నవ్వి తీరాలి. లేక పోతే చాలా ప్రమాదం.

మొత్తానికి ఆయన నా దృష్టిలో ఒక రకమైన ఆదర్శ మూర్తిగా కన్పించారు.

"మీకు అరవైఏళ్ళు దాటినా- అంత వయసున్నట్టు కన్పించరు. అన్నానోసారి.

ఈ కాలం తిండిలో బలమేదీ-? వరి చెత్తేగా... నేను చూడండి నాకు డెబ్భై ఏళ్ళంటే ఎవరన్నా నమ్ముతారా-" అన్నారు జవాబుగా, చిన్న పొగడ్తచాలు మనిషికి బ్రహ్మా నందం-

కొన్నాళ్ళ పరిచయంతో నాకు మొత్తింది. ఈ వల లోంచి తప్పించుకుండే ప్రయత్నంలో ఉన్నాను. క్లబ్‌లో వాళ్ళు నన్ను కూడా వెలివేసినట్టే ఉన్నారనిపించింది.

* * *

కొన్నాళ్ళకు ఆ ఊరునుండి బదిలీ అవడంతో వాళ్ళ వలలోంచి బయటపడ్డాను. అమ్మయ్య అనుకున్నాను. కాని

అప్పుడప్పుడు శివరామయ్యగారు జ్ఞాపకం వస్తూ వుంటారు. భూతకాలం తప్ప వర్తమానం, భవిష్యత్తులకు విలువ ఇవ్వని శివరామయ్యగారు నా కెందుకో ఓ వింతవ్యక్తిగా కన్పిస్తారు. ఆయనవల్ల ప్రయోజనం ఉండీ కూడా ఎవరికీ ఉపయోగపడని మనిషి. ఏళ్ళువచ్చి వయసు ఉడిగిన చెట్టుకూడా అంతో ఇంతో ఇతరులకు ఉపయోగపడుతుంది.

బదలీ అయి వెళ్ళిన ఊళ్ళో మళ్ళీ క్రొత్త పరిచయాలు క్రొత్త వ్యక్తులు.

అక్కడ క్లబ్ లో మొదటిరోజే కలిగిన పరిచయం నాకెంతో ఆనందాన్నిచ్చింది. మనిషి నడివయస్సులోవాడు ఆజాను బాహువు. ఆరడుగులు పొడవైన మనిషి. నిండైన విగ్రహం. నడుస్తున్నా మాట్లాడుతున్నా చాలా హుందాగా ఉంటుంది. ఆయన కళ్ళల్లో బోలెడంత ఆకర్షణ ఉంది. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తుంటాడు. అతను బోడిగుండు చేయించుకుని కాషాయవస్త్రాలు ధరిస్తే స్వామి శివానందలా ఉంటాడు. అంత వర్చస్సు ఎక్కడిదో! డార్క్ కలర్ టెర్లిన్ సూట్ లో నాసర్ విజ్ఞప్తికి తెస్తాడు. పొందూరు ఖద్దరు దోవతి- [దానికి ఎర్ర రంగు రుద్రాక్ష అంచు జరీ-] మోకాళ్ళవరకు లాల్చీ వేసుకుంటే కళకళలాడుతూ కాంగ్రెస్ ప్రెసిడెంటునే మరిపిస్తాడు. షెర్వాణీవేసి సన్నటి లాగు తొడిగితే ప్రిన్స్ లా ఉంటాడు. వెనక నెహ్రూని గురించి దుస్తుల విషయంలో చాలా ఎక్కువగా చెప్పుకునే

వారు. ఏ రకం దుస్తులు వేసినా గొప్ప పర్సనాలటీ కన్పి స్తుందని. నాకెందుకో ఆ మాటలు స్ఫురణకు వచ్చినయి.

"నా పేరు సురేష్ - మీరు ఈ ఊరుకి కొత్తగా ట్రాన్స్ఫరయి వచ్చినట్టుందే-" అని నవ్వుతూ పలకరించాడు పక్కన కూచున్నప్పుడు. ఆ చిరునవ్వులో బోలెడు ఆప్యా యత కన్పించింది. ఆ చిరునవ్వుకు కింది పెదవులు పైపెదవులు విడిపోకుండా కొంచెం పక్కకుసాగినై నాజూగ్గా- ఆ సున్నిత మైన పెదవుల కదలికకే - నా మీద పన్నీరు చల్లినట్లుగా హాయిగావుంది. చిరునవ్వు చాలా మందిలో చూశానుగాని ఈ చిరునవ్వులో నాకేదో ప్రత్యేకత కన్పించింది. నరాలన్నీ బిగబట్టి పెదిమలు సాగదీసినట్టుగా ఉంటుంది కొంతమందిలో. నవ్వినపుడు కళ్ళు ఏటో చూస్తయి. ఎందుకొచ్చిన ఖర్మరా అన్నట్టుగా ఉంటుంది. తెచ్చిపెట్టుకున్న "హా! కొరి నోస్"లా ఉంటుంది. అదివేరు ఇదివేరు

నవలలు చదవడంలో ఇంటరెస్ట్ ఉండడంవల్ల మేం ఇద్దరం మరీ దగ్గరకు వచ్చేం.

సురేష్ చాలా పుస్తకాలు చదివినట్టు కన్పిస్తాడు.

సాయంత్రం పూట లాన్‌లో కూర్చున్నపుడు మంచి మంచి కథలు చెప్తాడు తను చదివిన నవలల్లోవి.

నేనూ చెప్తాను.

మా పరిచయం పుస్తకాలు ఎక్స్ఛేంజ్ చేసుకుండే వరకూ వచ్చింది- ఒకరోజు లవ్‌ను గురించి చర్చ వచ్చింది

ఒక నవలకు సంబంధించినది. ఎనలైజ్ చేసి చక్కగా చెప్తున్నాడు.

“సెవన్ ఫేసెస్ ఆఫ్ లవ్ చదివారా? అన్నాను-నే చదివిన ఆ పుస్తకాన్ని గురించి క్లుప్తంగా చెప్పాను. సురేష్ ఎగిరి గంతేశాడు. అది నాకివ్వండి. తప్పక చదువుతాను” అన్నాడు.

“ఈ మధ్య ‘వ్యాలీ ఆఫ్ ది డాల్స్’ అని ఒకటి చదివాను బ్రహ్మాండంగా ఉంది, సిక్స్ మిలియన్ కాపీస్ పోయాయట ఇప్పటికి. ‘ట్వెంటీయత్ సెంచరీ ఫాక్స్’ వాళ్ళు పిక్చరుగూడా తీస్తున్నారు. రేపు తెస్తాను. ఆ పుస్తకం మీరు చదవండి...అన్నాడు” సురేష్.

నా ఆనందానికి మేర లేదు.

ఈ పుస్తకాల స్నేహంలో విచిత్రమైన అనుభూతి వుంది.

పరిచయం స్నేహంగామారి, స్నేహంలో చనువు గూడా ఏర్పడ్డది. ఒక రోజున అన్నాడు. పుస్తకాల ద్వారా ఏర్పడ్డ స్నేహితులు నాకు చాలా కొద్దిమంది. ఆ మాట కొస్తే అసలు లేరనే చెప్పచ్చు. మిమ్మల్ని చూస్తే నాకు ప్రాణం లేచి వచ్చింది.” అనీ.

సామాన్యంగా సురేష్ మితభాషిలా కన్పిస్తాడు. పుస్తకాల విషయం వస్తే మాత్రం అతనిదే పైచెయ్యి. క్లబ్ లో పుస్తకాల గొడవ ఎవ్వరికీ అక్కర్లేదు.

"మా ఇంటికి రాగూడదటండీ? ఓ రోజు సాయంత్రం. కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేద్దాం అన్నాడు ఓరోజు.

"అంతకంతేనా? వస్తా"నన్నాను.

ఎడ్రస్ రాసిచ్చి గుర్తులు చెప్పేడు.

అనుకున్న ముహూర్తానికే వెళ్ళాను.

నన్ను చూస్తూనే... "రండి, రండి... మీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఇల్లు సులభంగా కనుక్కోగలిగేరా?" అంటూ లోపలికి తీసికెళ్ళాడు. మళ్ళీ అదే చిరునవ్వు. నాకు పెయింటింగ్ రాదుగాని... వస్తే అతని ప్రొఫైల్...ఆ చిరు నవ్వు... రంగుల్లో కలిపితే ఎంత అందంగా ఉంటుందో! మోనాలిసాస్మైల్‌లా- సురేష్‌స్మైల్ - అని పేరు పెట్టచ్చు.

సురేష్ మేడమెట్లెక్కుతున్నాడు.

అతని వెనకాలే నేనూ...

దాదాపు ఎనిమిది గంటలవుతోంది.

సురేష్ అప్పుడే స్నానంచేసి- పొందూరు ఖద్దరుపంచె, లాల్చీ వేసుకుని, నుదుటి మీద పడుతున్న ఉంగరాలజుట్టు పైకి తోసుకుంటూ, శోభనపు పెళ్ళికొడుకల్లే కళకళ లాడు తున్న ముఖకవళికలతో, "రండి ఇలా కూర్చుందాం..." అంటూ సోఫా చూపించాడు. అదివరకు నేను గమనించలేదు గాని అతని మెళ్ళో చాలా సన్నని ఒంటిపేట బంగారు గొలుసు- లాల్చీకి పై రెండు బొత్తాములు పెట్టుకోకండా వదిలేయడంతో తళతళా మెరుస్తోంది. అసలే శరీరం బంగారు

ఛాయ. ఆ ట్యూబ్‌లైటు ముందు పున్నమ చంద్రుడులా వెలిగిపోతున్నాడు.

అది అతనిష్టడీ రూమ్‌లా ఉంది. నలువైపులా అద్దాల బీరువాలు, వాటిల్లోంచి పుస్తకాలు తొంగి చూస్తున్నాయి మాట పలుకులేకండా, గోడలకు పటాలు, క్యాలండర్లు ఇలాంటి వేమీలేవు. ఓ పెర్షియన్ కార్పెట్ రెండు సోఫాలు ఒక ఈజీఛైర్, దాని ప్రక్కనే సుమారు నాలుగైదు అడుగుల ఎత్తున నిల్చుని ఉన్న రీడింగ్ ల్యాంప్. ఆ రీడింగ్ ల్యాంప్ చాలా ఆకర్షణీయంగా ఆర్టిస్టిక్‌గావుంది. నాగుపాము పడగఎత్తి నిల్చున్నట్టుగా - మత్స్యకన్య వయ్యారంగా నిల్చుని, ఈజీఛైర్‌లో పడుకుని చదువుకుంటున్న వాళ్ళ ముఖంలోకి తొంగిచూస్తూ. ముద్దు పెట్టుకున్నట్టుగా...ఆ భంగిమలో ఉంది. సురేష్‌కి మంచి ఈస్తటిక్ సైన్స్ ఉన్న ట్టుంది. సోఫాలకు మధ్య చిన్నచిన్న టీపాయిస్ ఉన్నాయి. ఒకమూల టెలిఫోన్ ఉంది. మేడమీద మారుమూల గది నిశ్శబ్ద ప్రశాంత వాతావరణం. ఆ గదిలో కూచుంటేనే హాయిగా ఉంది.

"ఈరోజు చాలా శుభదినం..."

"అదేవిటి అలా అంటున్నారు."

"మీరు మా ఇంటికి రావడమే...సాధారణంగా ఇంటి కెవరినీ పిలవను, ఎవరూ రారు...మీలో గొప్ప ఆకర్షణేదో ఉంది—"

ఇలా ప్రారంభం అయింది మా సంభాషణ.

"ప్రతి మనిషిలోనూ మాగ్నెటిక్ వేవ్స్ ఉంటాయి. మనిద్దరిలో ఆ వేవ్స్ ఉన్నట్టుండి కలుసుకున్నాయి. పూర్వ జన్మలో మనిద్దరం చాలా దగ్గర వాళ్ళమై ఉండాలి" అన్నాడు సురేష్...

ఇంతలో నౌకరు కుర్రాడు ట్రేలో పకోడీలు, చిప్స్, కాష్యూనట్స్, మిక్స్చర్- తీసుకొచ్చి సెంటర్ టేబుల్‌లో ఉంచాడు. మెట్లమీంచి నౌకరు కుర్రాడు గబగబా కిందికి దిగి వెళ్తున్న చప్పుడు. మరో అయిదు నిమిషాల్లో మళ్ళీ ప్రత్యక్షం అయ్యాడు. ఈసారి అతని చేతిలో ఓ సీసా, రెండు గ్లాసులు అయిస్ ఫ్లాస్కూ ఉన్నాయి. అవి బల్లమీద ఉంచి మళ్ళీ వెళ్ళాడు. అతను మెట్లుదిగి వెళ్తుంటే మ్యూజికల్‌గా, మృదంగం వాయించినట్టుంది.

"మీకేం అభ్యంతరం లేదనుకుంటాను" అంటూ ఓపెనర్‌తో సీసా కార్కు తీసి రెండు గ్లాసుల్లోను పోశాడు సురేష్...

"అంతగా అలవాటు లేదనుకోండి. కాని కంపెనీకోసం తప్పక గ్లాసులు కలుపుతాను" అంటూ సోడాలు రెండు తీసుకుని ఓపెన్ చేసి ఆ గ్లాసుల్లో పోశాను. సురేష్ అయిస్ క్యూబ్స్ తీసుకుని రెండు గ్లాసుల్లోను రెండు వేశాడు. ఇద్దరు స్నేహితులు దగ్గర దగ్గరగా భోజనానికి కూచుని ఒకరి కొకరు వడ్డించుకున్నట్టుగా ఉంది. ఒకరు కూర వేయడం- ఒకరు నెయ్యి వెయ్యడం-ఒకరు పప్పు వెయ్యడం- ఇలా- రెండు చేతులూ కలిస్తే భోజన పదార్థాలన్నీ ప్లేట్లలో సిద్ధం- భోజనం రెడీ - అలాగే గ్లాసుల్లో పదార్థం రెడీ-

"త్రీచియర్స్-" అని సురేష్ గ్లాసు ఎత్తేడు.

మా ఇద్దరి గ్లాసులూ కలిసినై.

ఇద్దరమూ ఒక్కసారి సిప్‌చేసి బల్లమీద ఉంచాం గ్లాసులు. గ్లాసుల్లో ద్రావకమట్టం చాలా కొద్దిగా తగ్గింది.

"పకోడీలు తీసుకోండి-అంటూ ఆ ప్లేటును నా కందించాడు సురేష్.

"ఇంత ట్యూబ్‌లైట్ ఎందుకూ-? మనం మాట్లాడుకుంటుంటే ఈ లైటు మన వైపు భయంకరంగా చూస్తున్నట్లుంటుంది-" అంటూ ఆ లైట్ ఆఫ్‌చేసి మరో డిమ్‌లైట్ వేశాడు. సురేష్- ఆ లైటు వెల్తురు ఆకుపచ్చ రంగులో హాయిగా వేపచెట్టు నీడలా ఉంది.

"మీకు గుత్తివంకాయ కూర ఇష్టమే కదూ?- మన భోజనంలో ఇవాళ అదే స్పెషల్ డిష్- మావాడు అది తయారు చేయడంలో గట్టివాడులెండి" అన్నాడు సురేష్.

సెకండ్ రౌండ్ అయ్యేటప్పటికి సంభాషణ జీవితం మీదికీ, సాహిత్యం మీదికీ మళ్ళింది-

అసలు- జీవితంలో ఏం సాధించాలని ప్రతివాడూ తాపత్రయ పడుతుంటాడు-" అన్నాడు సురేష్-

"ఆ మాటకొస్తే ఈ తాపత్రయం ఎవ్వరిలో కన పడదు. భూమ్మీద పుట్టాం గనుక బ్రతికుండడం ఓ విధిగా- యంత్రంలా జీవితం సాగించడం తప్ప-" అన్నాను.

"గార్డెనర్ ది-" ది ఇండివిడ్యుయల్ అండ్ టుడేస్ వరల్డ్" చదివారా?

"లేదు-"

"పోనీ రస్సెల్?-" ఎడ్యుకేషన్ అండ్ గుడ్ వరల్డ్‌లో సొసైటీలో ఇండివిడ్యుయల్ కున్న పాత్రను గురించి బాగా రాశాడు."

"అవునవు"నన్నాను. ఆ పుస్తకం చాలా రోజులక్రితం చదివాను. నాకు చాలా నచ్చింది." అన్నాను.

ఈ చిప్స్ తీసుకుందాం. అని ఆ ప్లేటు ముందుకు జరిపేడు. నా సిగరెట్టు వెలిగించి తన సిగరెట్టు వెలిగించుకున్నాడు-

"ఒక దేశం భవిష్యత్తును - ఆ మాటకొస్తే ప్రపంచం భవిష్యత్తును- రూపు రేఖలను - మానవ కళ్యాణంకోసం మలచేశక్తి- ఒక్క వ్యక్తిలో ఉండే అవకాశాలున్నాయి- కాదంటే అతని వ్యక్తిత్వం మీాద ఆధారపడి ఉంటుంది- ఒక ఇండివిడ్యుయల్ సమర్ధత ఎంతైనా చేయగలదు."

"ఈ మాటలు నాకు చాలా నచ్చినాయి.

"వ్యక్తి మానసికంగా పెరిగినప్పుడే - అది సంభవిస్తుంది. పెరగడానికి తగిన వాతావరణం సృష్టించుకోవాలి" అన్నాను.

ఆ తర్వాత మేరేజి, మోరల్స్ మీాదికి వెళ్ళింది సంభాషణ.

మూడో రౌండ్ నడుస్తున్నది. గ్లాసుల్లో ద్రావకం పాదరసంలా కదులుతున్నది.

నా కంతగా అలవాటు లేకపోవడం మూలాన మూడో రౌండుకే- ఏ లోకానికో వెళ్ళినట్టుగా ఉంది.

సురేష్ కళ్ళు జ్యోతులల్లే ఎర్రపడుతున్నా తాపీగానే మాట్లాడుతున్నాడు. మనిషి మొత్తానికి టాప్‌లోనే ఉన్నాడు.

హాక్సలీ "జీనియస్ అండ్ ది గాడెస్" ప్రొఫెసర్ కథ ప్రారంభించాడు. అది నేనూ చదివేనుగాని సురేషు చెప్పే విధానంలో ఓ ప్రత్యేకత ఉంది. అతను చెప్తుంటే నవల మళ్ళీ చదివినట్టే ఉంది. చదివినప్పుడు నాకు తట్టని కొన్ని యాంగిల్స్ నుండి చెప్తున్నాడు- కథ మంచి పట్టులో ఉంది. ప్రొఫెసర్ భార్య- ప్రొఫెసర్ దగ్గర పని నేర్చుకుంటున్న అసిస్టెంట్-వాళ్ళిద్దరిమధ్య ప్రణయం. ఆమె అతని పక్కలో దూరడం- చాలా గమ్మత్తుగా వర్ణిస్తున్నాడు.

ఆ వాతావరణంలో అలాంటి ఘట్టాలే ఇంటరెస్టింగ్‌గా ఉంటాయి. ఏ లోకంలోనో ఉన్న నాకు బలే హాయిగా ఉంది.

క్షణంలో సగం.

నే కూర్చున్న సోఫా తమాషాగా కదిలినట్టు- అటూ ఇటూ ఒరిగినట్టుగా ఉంది, కిటికీలు టపటప కొట్టుకుంటున్నాయి. ఇదేం భూతాలకొంప కాదుకదా అనుకున్నాను.

సురేషు సోడాకోసం కుర్చీలోంచి లేచి- తూలి పడబోయినాడు.

మేడంతా అదిరి దడదడమన్నది.

లైటు ఆరిపోయింది.

గాఢాంధకారం...

నేనెందుకో వణుకుతున్నాను.

"ఇది భూకంపమండోయ్..." అన్నాడు సురేషు...

సిగరెట్టు వెలుగులో సురేషు ముఖం లీలగా కన్పిస్తున్నది...

బాల్కనీ దాకా వెళ్ళి బయట చూశాం. చిక్కని చీకటి- పుటము కున్నది. చాలా మంది జనం నక్షత్రాల వెలుగులో రోడ్లమీద అటూ ఇటూ పరుగెత్తుతున్నారు.

ఇది భూకంపమేనని అప్పటికిగాని నిర్ధారణకు రాలేదు. నాకెందుకో ఆ సమయంలో శివరామయ్యగారు జ్ఞాపకానికి వచ్చేరు... "ఇదేం భూకంపం అండీ చచ్చు బూకంపం... అబ్బో... మా రోజుల్లో..." అనేవాడు.

"ట్రెమర్" తగ్గిపోయింది లెండి. రండి రండి కూర్చుదాం" అన్నాడు సురేషు.

తడుముకుంటూ లోపలికి వెళ్ళి ఎవరి స్థానాల్లో వాళ్ళు కూర్చున్నాం.

బల్లమీద సిగరెట్టు ప్యాకెట్ కోసం వేళ్ళు జాపితే గ్లాసు తగిలి పలికిపోయింది. సురేషు అగ్గిపిల్ల వెలిగించి ఆ వెలుర్లో ఫోన్ దగ్గిరకువెళ్ళి పి. టి. ఐ.కి ఫోన్ చేస్తున్నాడు.

మళ్ళీ వచ్చి కూర్చున్నాడు.

"మేడ దడదడ లాడడం- నేను సోఫాలోంచి గమ్మత్తుగా కదలడం గమనించాను. కాని ఇది బూకంపమని అనుకోనే లేదు. వెంటనే మనంకూడా కిందికి వెళ్ళిపోవలసింది" అన్నాను.

"వెళ్ళేలోపల మేడ కూలితే-" అని నవ్వేడు సురేషు.

"మళ్ళీ ఈసారి వస్తే- మనిద్దరి శవాలు ఈ డెబ్రిస్ లోంచి బయటకు లాగడానికి వాళ్ళ దుంప తెగుతుంది-" అన్నాను.

"అసలు చావంటే భయంకన్నా - చచ్చిపోయిం తరువాత పెళ్ళాం బిడ్డలూ ఏమవుతారోనన్న భయం జాస్తి మనిషికి. వెలుగుతున్న దీపం ఆరిపోతే- దీపానికేం భయం? ఆరిపోవడంవల్ల ఇతరులకు చీకటవుతుందని ఆందోళన- అందు కనే ఆరిపోయే ముందు రెపరెప కొట్టుకుని గిజగిజ తన్ను కుంటుంది-" అన్నాడు సురేషు తాపీగా-

"ఉన్నట్టుండి చచ్చిపోతే - చచ్చినవాడి మీద సాను భూతి తాత్కాలికంగా ఉన్నా పెళ్ళాం పిల్లల్ని నడి సము ద్రంలో ముంచి వెళ్ళాడని తిట్టిపోస్తారు" అన్నాను.

మా సంభాషణ ప్రణయ ఘట్టంలోంచి మృత్యు ఘట్టంలోకి దూకింది.

"కొంతమంది సంతోషంగా హాయిగా నవ్వుతూ కన్ను మూస్తారు. ఆ చావు చాలా గ్రేస్‌ఫుల్‌గా ఉంటుంది- అయినా నా కెవ్వరూ లేరులెండి. ఏకాకిని, నే చచ్చిపోతే "అయ్యో పాపం అనేవాళ్ళు బహు కొద్దిమంది ఉంటారు మీలాంటి మంచి స్నేహితులెవరో" అన్నాడు సురేషు-

"మీ రలాంటి మాటలనకండి, నాకు చాలా బాధగా ఉంటుంది- ఎప్పుడో వచ్చే చావును గురించి ఊహించుకుని ఇలా సినికల్‌గా అనుకోడం ఎందుకు? ఏదన్నా ఇంటరెస్టింగ్ కథ చెప్దురూ-" అన్నాను.

అప్పటికే మా ఇద్దరి గ్లాసులూ ఖాళీ- అగ్గిపుల్ల వెలిగించి సీసా నందుకున్నాడు. గ్లాసుల్లో పోస్తుంటే అగ్గిపుల్ల ఆరిపోయింది. దాని బతుకెంత! క్షణం. నేను మరో అగ్గిపుల్ల వెలిగించాను- సోడాలు- అయిస్- అన్ని పదార్థాలు తయారయినై-

సిప్ చేసి గ్లాసు బల్లమీద ఉంచి- "ఇప్పుడు వినండి-" అన్నాడు సురేషు-

గదిలో చీకటి. బయట చీకటి.

మా ఇద్దరి సిగరెట్లు వెలుగులో గదిలోని వస్తువులు, సురేషు మెళ్ళోని సన్నని గొలుసు, అతడు వేసుకున్న తెల్లని లాల్చీ. అతని కళ్ళల్లోని నల్ల పాప లీలగా కన్పిస్తున్నాయి.

"పూర్వం రాజులూ యువరాజులూ, జమీందారులూ ఊళ్ళు ఏలుతున్న రోజుల్లో మంగమ్మ అని ఒకావిడ ఉండేది. చాలా అందమైంది. కాకినాడ దగ్గర ఏదో చిన్న ఊరు. ఆమెకు పదహారోఏట ఒక యువరాజావారు కన్నెచెర విడిపించారు. మంగమ్మ దేవదాసి. వంశపారంపర్యా వస్తున్న వృత్తి గనుక ఇదెవరూ తప్పుగా అనుకునే వారుకాదు. ఆమె బంగారు బొమ్మ. చిదిపి దీపం పెట్టచ్చు... బోలెడంత నిజాయితీగల మనిషి ... సంగీతం పాడేది. జావళీలు ఆమె స్పెషాలిటీ——

తరువాత కొన్నాళ్ళకు యువరాజావారు కన్నుమూశారు. మంగమ్మ చాలా దుఃఖించింది.

ఆ తరువాత ఎవరో ఆమెను దగ్గరకు తీశారు... ఆ

రోజుల్లో అలా దగ్గర తీయడాన్ని ఉంచుకోవడం అనే వారట...

ఆయన అప్పటి ప్రభుత్వంలో చిన్న ఉద్యోగి- ఏం ఉద్యోగమో తెలియదుగాని మొత్తానికి రెండు చేతులా గడించేవాడట- "లంచాలు తిని ఇలా సంపాయిస్తున్నారు. ఇది తగనిపని" అని మంగమ్మ మందలించేదట అప్పుడప్పుడు-

"మంగా! నీకు తెలియదు ఊరుకో-" అంటూ ఆవిణ్ణి ఎత్తుకునేవాడు.

ముద్దుపెట్టుకోపోతే- "అబ్బ. కంపు- ఈ తాగుడు మానేద్దురూ-" అనేదట.

"దాంట్లో మజా నీకేం తెలుసులే-" అంటూ ఆమె నిమ్నోన్నతాలు సుకుమారంగా పరిశీలించేవాడట.

ఏమైనా మంగమ్మ అతన్ని నమ్ముకుంది. ఆ తరువాత కొన్నాళ్ళకు మంగమ్మ తల్లి కాబోతున్న సూచనలు కన్పించి నాయి- ట్రాన్స్ఫర్ అయిందని ఆ ఊరునుంచి ఉడాయిం చాడు. పత్తాలేదు. మంగమ్మ ఒంటరిదయిపోయింది. సూరయ్య పుట్టాడు. మంగమ్మకు సూర్యుడు ప్రత్యక్ష దైవ మనే ఏదో పిచ్చి నమ్మకం ఉంది. సూరయ్యా పెరిగి పెద్ద వాడవుతున్నాడు. ఆ పరిస్థితుల్లో మంగమ్మ బజార్న పట్టంలో ఆశ్చర్యం లేదు...విటుల రాకపోకలు ఎక్కువైనై... వయసు పొంకం బిగువు ఎన్నాళ్ళుంటుంది? అది సడలిం తరువాత మంగమ్మ ఒంటరిదయింది. ఆమె వయసు ఏమంత ఎక్కువ కాకపోయినా వృద్ధాప్యం బూతంలా ఆమె మీద విరుచుకు

పడ్డది. ఆ దెబ్బకు తట్టుకుని లేచి నీరసంగా నిలబడగలిగింది. కసిగా నిల్చున్నది- పగబట్టిన కొండె త్రాచై నిల్చున్నది-"

కాశీ మజిలీలో కథలా చెప్తున్నాడు సురేష్...

గ్లాసులు ఖాళీ...

మళ్ళీ అగ్గిపుల్లల వెల్తురు.

సీసాలోని పదార్థం గ్లాసులో వరిగింది. సోడాలు... ఐస్...

సురేషు కళ్ళు రక్తపు బంతులల్లే ఉన్నాయి... మనిషి జోరుగా మాట్లాడు తున్నాడు గాని నాలిక మడతబడి మాటలు తడబడుతునై.

"సూరయ్యకు యుక్తవయసు రావడం మానదుగదా. రోజులు గడుస్తున్నాయి. కాబట్టి.

మంగమ్మ మకాం పట్నవాసం మార్చింది. అది మహా పట్నం. సూరయ్య బాగా తయారవు తున్నాడు. అలా తయారు చేసింది మంగమ్మ. ప్రతిరోజూ గుప్పెడు బాదం పప్పు తినేవాడు. కండలు పెంచాడు. వయసు చిన్నదయినా రాకుసుడిలా తయారైనాడు. మంగమ్మ శరీర ఛాయ, అందం పుణికి పుచ్చుకున్నాడు, సూరయ్య.

మంగమ్మ పట్నం అంతా ఒకటి రెండుసార్లు సర్వే చేసింది. వయసులో ఉండి పెళ్ళికాని అందమైన ఆడపిల్లలు చాలా మంది కన్పించారు. కొంతమంది ఉద్యోగాలు చేసే వాళ్ళు...చదువుకునేవాళ్ళు... కొంతమంది భర్తలు పోయిన వాళ్ళు...అనేక ర గాలు.

కథా నిలయం
1563
శ్రీకాకుళం

మంగమ్మ ఈ కళలో ఆరితేరిన ఘటం- ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది.

మంగమ్మ రోడ్డుమీద వెళ్తుంటే ఎవరూ ఆమెని అనుమానించరు ఒక్కొక్కప్పుడు పెద్దపెద్ద ఆఫీసుల్లోకి నేరుగా వెళుతుంది. ఆడపిల్లలతో మాట్లాడుతుంటే వాళ్ళ బంధువులేమోనని పక్కవాళ్ళు గూడా అనుకునేట్టుగా ఉంటుంది. ఇందులో తప్పేముంది? వాళ్ళకు మాత్రం మగ వాసన తగలకపోతే ఎట్లా పాపం అని వాళ్ళమీద జాలి పడేది.

వారంలో ఏడు రోజులూ రోజుకు ఒకరు వస్తుండే వారు. మంగమ్మ ఇంటికి వాళ్ళందరికీ సూరయ్య తృప్తిగా జవాబు చెప్పి పంపేవాడు. మంగమ్మ తలపెట్టిన ఎక్స్పెరిమెంట్ సక్సెస్ అయింది. వచ్చినవాళ్ళెవ్వరికీ సూరయ్య మంగమ్మ కొడుకని తెలియనిచ్చేదికాదు. పాపం వాళ్ళేదో కష్టాల్లో ఉన్నారు. వాళ్ళకు సహాయ పడుతున్నట్టుగా నటించేది. మంగమ్మ చూస్తే చాలా హైక్లాస్ మనిషిలా ఉండేది. దానికి తగినట్లుగానే పారితోషికం ముట్టేది.

సూరయ్య ఆరోగ్యవంతుడూ రసికుడూ అవడంవల్ల రేటు పెరిగింది. కస్టమర్స్ పెరిగారు. ఊళ్ళో మంగమ్మ పరపతి పెరిగింది. మంగమ్మని, అత్తయ్య అని, పిన్ని, అని, అమ్మమ్మ అని, అనేక రకాలుగా పిల్చేవారు. ఆ రోజుల్లోనే ఎక్కడో టీచరుగా చేస్తున్న గంగాభాగీరథి ఒకామె- ప్రౌఢ,

సకేశి సూరయ్యకు చదువుగూడా నూరిపోసేది. అన్ని విధాలా సూరయ్య జీవితం బాగానేవుంది. మందులు, ఇంజక్షన్లూ, టానిక్కులూ తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడు కుంటూనే ఉన్నాడు. శని ఆదివారాల్లో ఒకరోజు పాపం... అయిదారుగురికి సమాధానం చెప్పవలసి వచ్చినపుడు ఉక్కిరి బిక్కిరి అయినాడు."

సూరయ్యను చూస్తే నాకు జాలేసింది. ఎంతచెడ్డా మామూలు మనిషేగా? రాక్షసుడు కాదుగా.

ఇంకా లైట్లు రాలేదు?

మళ్ళీ మేడ దడదడ లాడినట్లయింది. గబగబ చెప్తున్నాడు సురేష్.

"ముగించేస్తాను. ఈ గ్లాసు పుచ్చుకోండి" అన్నాడు.

గ్లాసులు పుచ్చుకుంటూనే ఉన్నాం.

అగ్గిపుల్లలు వెలుగుతునే ఉన్నాయి...

"టూకీగా చెప్పాలి. మళ్ళీ భూకంపం వచ్చేలోగా." అంటూ మొదలెట్టాడు.

"మంగమ్మ నెవరోపిల్చారు. ఉన్నట్టుండి ఒకరోజు హాయిగా, ప్రశాంతంగా నవ్వుతో కన్ను మూసింది. ప్రాణం పోకడ, వానరాకడ తెలియదంటారు. కాని ఆమెకు తెలుసు సూరయ్యను దగ్గరకు పిలిచింది. "నీవు నాకు తల్లివి...తండ్రి ఎవరో ఇంతవరకూ చెప్పలేదు. ఇప్పుడైనా చెప్పమ్మా-ఎక్కడున్నాసరే వెతికి ఆయన్ని కలుసుకుంటాను" అన్నాడు.

ఆయన పేరు నీ కనవసరం ... ఆయన ఉనికి నాకే తెలియదు. ఈపాటికి ఆయన కూడా చచ్చిపోయే ఉండ వచ్చు...నీ జీవితం ఎప్పుడూ ఇలాగే ఉండగూడదు. నీవో మనిషిగా బ్రతకాలి. గతం అంతా ఒక కల అనుకో... అంటూ సన్నటి ఒంటిపేట గొలుసు సూరయ్య మెళ్ళో వేసింది. ఇదే నీకు శ్రీరామరక్ష. నాకు వారిచ్చిన కానుక ఇది. కాటన్ అనే దొరగారెవరో ఆయనకు బహూకరించా రట ఇది. అందుచేత ఇది చాలా విలువైనది..." అని అన్నది.

మంగమ్మ చచ్చిపోయింది. సూరయ్య మకాం మార్చాడు. గత జీవితం వలలోంచి బయటపడి మనిషై బ్రతుకుతున్నాడు. కథ కంచికి ... అన్నాడు సురేషు... లాల్చీ గుండీలు పెట్టుకుంటూ.

ఇంకా లైట్లు రాలేదు.

సీసా ఖాళీ అయింది.

సురేషు కళ్ళు నెత్తురుకక్కుతున్నై. తూలుతున్నాడు.

"లెటస్ డ్రైవ్ ది డెవిల్ అవుట్" అంటూ అగ్గిపుల్ల వెలిగించి సీసాలో పడేశాడు. మంట భగ్గునవచ్చి "ఠప్"మని ఆరిపోయింది.

శివరామయ్యగారు-కాదు- గాడు జ్ఞాపకం వచ్చాడు. స్కౌండ్రెల్... బ్లడీఫెలో- వాడో పెద్ద డెవిల్... భూతం గాడు అనుకున్నాను.

ఇద్దరం మళ్ళీ సిగరెట్లు ముట్టించాం.

"ఇవ్వాళ వండర్‌ఫుల్‌గా గడచిపోయింది...నా జీవితంలో మరపురాని దినం-మంచి అనుభూతి... మీరు చెప్పిన మంగమ్మకథ... పాపం ఆవిడ ధన్యురాలు- ఈ మధ్యలో వచ్చిన భూకంపం...గ్లాసులు...సీసా... పకోడీలు...రియల్లీ వండర్‌ఫుల్..." అంటూ సురేషును కౌగలించుకున్నాను.

ఇంతలో లైట్లు వచ్చిన్నాయి.

"భోజనానికి లేద్దాం. పదండి-" అంటూ డైనింగ్ రూమ్‌వైపు దారితీశాడు, సురేషు వెనకాలే నేనూ...

జ్యోతి

... 0₀0 ...